# అభిరుచులు

రచన :
"పుష్యమి"

(గత సంచిక తరువాయి)

'ఏమయితే వెళ్ళిపోతారేం?'

'ఫరవాలేదు!'

'అలాకాదు! మీరుండండి! నే కిందికి వెళ్ళిపోతాను!'

'ఎందుకూ? నే వెళ్ళిపోతా!'

'అలా అయితే నేనూ వచ్చేస్తా!'

కమల వెనుతిరిగి రవికేసి చూచింది! రవి నవ్వుతున్నాడు!...కమల ఆగిపోయింది! వెనక్కి వచ్చి, డాబాపిట్టగోడ నానుకుని, దూరంగా వున్న చెట్లవైపు చూడసాగింది!...రవి ఆమెకేసే తదేకంగా చూస్తున్నాడు!...అస్తమిస్తున్న సూర్యకిరణాల ఎర్రని కాంతిలో, ఆమె చెక్కిళ్లు మరింత తళతళమన్నాయి! రెండు కనుబొమలనూ పైకెత్తి, దేన్నో తదేకంగా చూస్తోంది!...

కమల యిటు తిరిగి, రవివైపు చూచింది!...రవి తడబాటుతో, చూపు తిప్పుకుని, అడిగాడు!

'మీరు పి. యు. సి. చదువుతున్నారా?'

'అవునండి!'

'మీ అమ్మగారికి మీ రొక్కరేనా, యింకా ఎవరేనా ఉన్నారా?'

'నే నొక్కర్తినే కూతుర్ని!'

రెండు నిముషాలు మౌనంగా వున్నారిద్దరూ!...ఆమె ఎటో చూస్తోంది!...రవి ఆమెను చూస్తున్నాడు!

రెండునిమిషాలయాక రవిని అడిగింది కమల!

'అన్నట్టు అడగడమే మర్చాను!-మీరేం చదివారు? ఏం ఉద్యోగం చేస్తున్నారు?'

రవికి ఏం చెప్పాలో తెలవలేదు!...కొంచెం ఖంగారుపడ్డాడు!-తను ఫిఫ్తుఫారం కూడా పూర్తిచెయ్యలేదు!...ఆమె పి. యు. సి. చదువుతోంది!-ఆ విషయం చెపుతే నవ్వుతుందేమోనని భయవేసింది!-అయినా, అడిగాక అసలు చెప్పకపోతే బాగుండదని, ...

'పెద్దచదువేమీ చదవలేదు లెండి!-ప్రస్తుతం ఓ నాటకకంపెనీలో పనిచేస్తున్నాను! నాకు నాటకాలూ, నటనా అంటే యిష్టం!' అన్నాడు సంశయిస్తూ!

'నాటకాలంటే నాకూ చాలా యిష్టమండీ! మొన్న మా కాలేజీలో నాటకం వేసారు! ఎంత బాగుందనుకున్నారు?'

ఆమెకికూడా నాటకాలంటే యిష్టమని వినేసరికి, రవి కాస్త ధైర్యంగా నవ్వాడు!

యిప్పుడు కమల తానే రవిని పలకరించి, చనువుగా మాట్లాడుతోంది! ఆమె మాట్లాడుతున్నంతసేపూ, మత్తులో ఆమె సౌందర్యానికి ముగ్ధుడయిపోతున్నాడు రవి! ఎప్పుడూ నవ్వుతూ మాటాడే కమలరూపు అనుక్షణం అతని కళ్ళముందు నాట్యమాడుతూ, అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది!

ఒకనాడు కమల ఏదో నవలకోసం రవి రూములోకొచ్చింది! గాలికి ఆమె ముంగురులు నాట్యం చేస్తున్నాయి! తెల్లటి పరికిణీపైన, లేత గులాబీరంగు జాకెట్ వేసింది! కొట్టొచ్చినట్లు కనపడుతోంది ఆమె తొడుక్కున్న ముదురాకు పచ్చజాకెట్! ముగ్ధుడయిపోయాడు రవి! 'అంత సౌందర్యరాసి తనెదురుగా వచ్చి నిలబడితే తానిలా అమాయకుడులా, అవకాశాన్ని జారవిడవడమా!' అనే ఆలోచన తలెత్తింది! ఆమె నొక్కసారి తన బాహువులలో యిమిడ్చి ఆ సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలనే తృష్ణ ఎక్కువయిపోతోంది! రవి శక్తులన్నీ అతనివశం తప్పాయి!-మంచంమీద కూర్చున్నవాడు లేచాడు!...

'రవిగారూ! మొన్నటి నవల నాకోసారి యివ్వండి! చదివి సాయంత్రం యిచ్చేస్తా!' అంది నవ్వుతూ కమల.

టేబుల్ మీదున్న పుస్తకం తీసి, ఆమె కందించబోతూ, ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు!

కమల భయంగా 'రవిగారూ!' అంది వణుకుతూ!

రవిగుండె దడదడా కొట్టుకుంది!-ఏదో తెలియని భయం ప్రవేశించింది! యిక ముందుకు సాహసించలేకపోయాడు!-చెమటలు పట్టి, భయంతో వణుకుతున్న ఆమెను చూచి, తానేదో ఘోర పాపకార్యం చేస్తున్నాననిపించింది! ఆమె చూపులు జాలిగొలిపాయి! ఆమె చెయ్యివదలి!-ఆ చేతికేసి చూచాడు! ఆ చేతి బొటనవేలుకున్న గాయిం కనపడింది!



'అదేమిటండీ? అగాయం?-వేలు తెగిందా?' అన్నాడు, ఆమె మనసు కాస్త కుదుటపడింది!

'ఈ చిన్న గాయాన్నేనా, మీరు అంత ఆశ్చర్యంతో చూస్తూంట?-యిది పెన్సిల్ చెక్కుతూంటే బ్లేడు తెగింది! అంతే!' నిజంగా అతడు ఆ వేలు చూడటానికే చెయ్యి పట్టుకున్నాడనుకొంది కమల!

'అలాగా! అది చూడ్డానికే చెయ్యి పట్టుకున్నాను, పెద్దగా యేమోనని! మీరు మరోలా ఊహిస్తే క్షమించండి!' అన్నాడు రవి తలదించుకుని!

'అబ్బే! నేనేమీ అనుకోలా! నేనూ అందుకే అనుకున్నా!' అని, పుస్తకంతీసుకుని, వెళ్ళిపోయింది కమల! ఆమె వెళ్ళాక అద్దంలో ముఖమంతా చెమటలే! గుండె యింకా వేగం తగ్గలేదు. కళ్ళు మూసుకుని మంచంమీద వాలాడు ఆలోచిస్తూ!

తను ఎంత నీచంగా ప్రవర్తించాడు! మంచిగా ఊహించింది కాని, లేకపోతే ఏం చేసునో కమల?... లాగి లెంపకాయ కొట్టును! మైకంలోంచి మేల్కొల్పబట్టి గాని, ఎటువంటి ఫలితాలకు దారితీసునో ఆ సంఘటన! యింతవరకూ లేని ఆ తుచ్ఛవాంఛ ఈనాడెందుకు కలగాలి?... యువ్వనవంతులైన పడతులుండే పరిసరంలోని ప్రభావం అన్నమాట! తన అభివృద్ధిని కాంక్షించి; తన కూతురును పెళ్ళిఆడతాననే ఆశతో వున్న మామయ్య కూతురు లక్ష్మికి అన్యాయంచేస్తున్నానన్నమాట తను! పరిసరాలకు లొంగి; తప్పటడుగు వేసి, శీలానికి కళంకం ఏర్పరచుకుంటే, తాను వివాహమాడబోయే లక్ష్మికి అన్యాయం చేస్తున్నానేమో తాను?-సర్వశక్తుల్నీ కూడ దీసుకుని తన ప్రవర్తనలో చెడుమార్పు కలగకండా, తన మనస్సు తప్పుదార్లు తొక్కకండా, తనని తనే కాపాడుకోవాలి! తానెవరికీ అన్యాయం చేయకూడదు!

రవి ఆలోచించి, ఆలోచించి, తనమకాం, ఆ యింటి నించి మార్చెయ్యడానికి నిర్ణయించుకున్నాడు! ఆడదాని సౌందర్యానికి అమడదూరంలో వుండతల్చుకున్నాడు. 'ఏం నాయనా? నీకేమన్నా అసౌకర్యంగా ఉందా యిక్కడ?' అని అడిగింది కమల తల్లి!

'లేదండి! మా ఆఫీసుకు దూరంగా వుందని, దగ్గరగా ఓ గది తీసుకున్నాను! నిజంగా యిక్కడే నాకెంతో సౌకర్యంగా ఉంది!' అని చెప్పాడు రవి ఆమెతో?

రవి గదివిడిచి వెళ్ళిపోవడం ఆశ్చర్యం కలిగించింది కమలకు!

*   *   *

ఆ సంవత్సరం నాటకకళాపరిషత్ బెజవాడలో పెట్టారు!

'ఈ సంవత్సరం పరిషత్‌కి, పసందయిన నాటకం కట్టి, ఫస్టుప్రయిజు సంపాదించాలి రవిగారూ! మరి ఏంచేస్తారో! మన సమాజం పేరుప్రతిష్ట నిలబెట్టే బాధ్యత ఈ సంవత్సరం మీపైన పెడుతున్నాను!' అన్నాడు రవి పనిచేస్తున్న నాటకసంస్థ ప్రొప్రయిటరు!

'నాకు వేరేపని ఏముందండి! మీరు జీతం యిచ్చి నన్ను పోషించేటప్పుడు, నాలో ఉన్న శక్తినంతనీ ధారపోసి, మన సంస్థ పేరు నిలబెట్టే బాధ్యత నాకుమాత్రం లేమా! వేరే మీరు చెప్పాలా?—ఏదేనా ఒక మంచి నాటకాన్ని ఎన్నండి! పరిషత్‌లో పాల్గొనటానికి తయారవుదాం!'

'ఆ నాటకాన్ని ఎన్నే బాధ్యతకూడా మీమీదే పెడుతున్నాను రవిగారూ!' అన్నాడు ప్రొప్రయిటర్!

రవి ఒక మంచి నాటకాన్ని ఎన్ని, తన తెలివితేటలూ, అనుభవాలూ ఉపయోగిస్తూ, తరిఫీనునిచ్చాడు నటీనటులకు! రాత్రింబవళ్ళు తన కాలాన్నంతా వినియోగించి, నాటకానికి కొత్తమెరుగులు దిద్దాడు!

పరిషత్‌లో తన నాటకాన్ని ప్రదర్శించాడు రవి! ఆ పరిషత్‌కి, పేరుమోసిన పెద్ద పెద్దలూ, సినిమా కళాకారులూ ఆహ్వానించబడ్డారు! పెద్దలందరి సమక్షంలో తన అద్భుత కళానైపుణ్యాన్ని ప్రదర్శించాడు!... పాత్రలో లీనమై నటించాడు! ఆ లీనత్వంలో, పాత్రకున్న సహజత్వాన్ని ప్రతిబింబింపజేసాడు! ఆ పాత్రకు పూర్తి న్యాయాన్ని చేకూర్చాడు!

పరిషత్ పూర్తయింది!—

పోటీలో రవి ప్రదర్శించిన నాటకానికి ప్రథమబహుమతి లభించింది!—దానితోబాటు ఆ పరిషత్‌లో రవి ఉత్తమ నటుడుగా ప్రథమ బహుమతి పొందాడు!

రవి ఫోటో అన్ని పేపర్లోనూ పడింది!—అతని నటనాకౌశల్యాన్ని భారీగా పొగిడాయి పత్రికలు!

పరిషత్‌లో రవి బహుమతి అందుకుని బయటకు



రాగానే, ఓ అపరిచితవ్యక్తి ఎదురై కరచాలనం చేసాడు!

'మీ నటనాకౌశల్యానికి నా అభినందనలు!' అన్నాడావ్యక్తి నవ్వుతూ!

'అందుకు కారణం మీలాంటి పెద్దల ప్రోత్సాహం, ఆశీర్వాదబలమేనండి!' అన్నాడు నమ్రతతో తలవంచుకుని రవి!

'మీరు సినిమాలలో బాగా రాణిస్తారు! మీ నటన చూచాక, మీకు మంచి భవిష్యత్తు వుందని నాకు తోస్తోంది!'

'ఆఁ!...సినిమానటుడయేటంత గొప్పతనం నాలో ఏదండీ!. అటువంటి కోరిక నాలాటివాడికి, అందని నక్షత్రాలకై అర్రులు చాచడం అంత అవివేకమేమో?

'ఎందుకండీ అంత నిరుత్సాహం మీకు? యిప్పటి మేటి నటులలో ఉన్న గొప్పతనం ఏమిటి?—ఏదో మోజుగా పోతోంది కాలం!—నా ఉద్దేశ్యంలో, వారికి మీరేమీ తీసిపోరు!'

'.........' రవి మాటాడలేదు!

'ఒకవేళ మీకు సినిమాలో అవకాశం లభిస్తే నటిస్తారా?'

'అంతటి అదృష్టం ఎక్కడలెండి! కాకపోయినా, కొత్తవారిని పరిచయం చేయటానికి సాహసంచూపే నిర్మాతలు చాలా అరుదు! వ్యాపారదృష్టితో సినిమా తీసే ఈనాటి సినిమా నిర్మాతలు, కొత్తవారికి అవకాశమిస్తే, ఎక్కడ డబ్బు రాదో అని భయపడుతున్నారు! యిటువంటి రోజులలోనా నాకు సినిమాలలో అవకాశం లభించేదె?' ప్రస్తుత సినిమా వ్యాపార పరిస్థితుల్నిగూర్చి నిశితంగా విమర్శించాడు రవి!

ఆయన నవ్వాడు ఆ మాటలు విని!

'మీ మాటలతో పూర్తిగా ఏకీభవిస్తాను! ప్రస్తుత నిర్మాతల దృష్టి, డబ్బు సంపాదనమీదే మొగ్గివుంది గాని, స్వచ్ఛమైన కళాసృష్టిమీద లేదు! అందుకే మీలాంటి ప్రతిభగల కళాకారులకు అవకాశాలు లభించటంలేదు! మీలాంటి కళాకారులు మరుగున వుండవలసివస్తోంది!...'

'అవును. ఏంచేస్తాం?...'

'ఏంచేస్తామా? అటువంటి అన్యాయపు రోజులలో మార్పు తేవటానికి ప్రయత్నిస్తాం! చీకటిలోవున్న మీలాంటి కళాకారులను వెలుగుకు తెస్తాం! వారిని ప్రజలకు పరిచయంచేసి, నేటి అగ్రశ్రేణి నటుల అహంభావానికి ఒక హెచ్చరిక నిస్తాం!' ఆవేశంగా అంటున్న ఆయన మాటలు అర్థంకాలేదు రవికి! ఆయన ఎవరో తెలవక తికమకపడ్డాడు! సినిమా రాజకీయాల్లోని, అరాచకాలను రూపుమాపటానికి ప్రయత్నిస్తున్న ఓ రాజకీయవాదని ఊహించాడు!—అదేదో తేల్చుకుందుకు అడిగాడాయన్ని,

'యింతకీ మీరెవరో అడగడం మర్చాను!' అన్నాడు!

(సశేషం)

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.

# అభిరుచులు

రచన :
"పుష్యమి"

(గత సంచిక తరువాయి)

"అవును, మాటల ధోరణిలో చెప్పటమే మరచాను! ...నేనొక నిర్మాతని! ఓ సినిమాతీసే ప్రయత్నంలో వున్నాను! యిదివరకు మూడు పిక్చర్లు తీసాను! యిది నా నాలుగవ చిత్రం!"

"అడుగుతున్నందుకు క్షమించండి!—మీపేరు తెలుసుకోవాలని కోరుతున్నాను!"

"ఏమీ తప్పులేదు!—నాపేరు దయానంద్ మా సంస్థపేరు 'జయ ప్రొడక్షన్స్!' "

"ఆఁ!...జయా ప్రొడక్షన్స్ అధిపతి, ప్రఖ్యాత నిర్మాతలూ మీరేనా?"

"అవును!"

"దయానంద్ గారూ! మీరు యింతవరకూ తీసిన సినిమాలలో ప్రతిబింబించిన మీ ప్రతిభను నేను చాలా అభినందిస్తున్నాను. యిలా, అనుకోకుండా, అదృష్టవశాత్తూ, మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకీరోజు కలిగినందుకు నేను చాలా గర్విస్తున్నాను!"

"అదిసరే!...రవిగారూ! మా సినిమాలో నటించడానికి మిమ్మల్ని ఆనందంతో ఆహ్వానిస్తున్నాను! నా యీ పిక్చర్లో అందరూ కొత్త కళాకారులే వుంటారు! మూలమూలల దాగిఉన్న మహాశక్తుల్ని వెలికి లాగి, మన ప్రజలకు అందచెయ్యటమే నా ఆశయం! ఆనాడే సినిమా కళకూ, దేశంలోని ప్రతిభావంతులైన కళాకారులకూ తగిన న్యాయం చేకూర్చినవాణ్ణవుతానని నా నమ్మకం!...ఏమిటి మీ ఉద్దేశ్యం? ..మా పిక్చర్‌లో 'హీరో'గా బుక్ చేయ సంకల్పించాను మిమ్మల్ని!—ఏమంటారు?"

రవి ఉక్కిరిబిక్కిరయాడు! ఆయన నోటినించి వచ్చేవి యదార్థాలా?—వెళాకోళమా?...తనకింత దగ్గరలో సినిమా చాన్సు ఎదురవుతుందనీ; తానూ ఒక సినిమా కళాకారుడవుతాడనీ, ఎన్నడూ కలలోనైనా ఊహించలేదే!—

"నాలో అంతటి ప్రతిభ ఎక్కడిదండీ?...అన్నాడు రవి.

"రవిగారూ! ఎవరిశక్తులు వారికి తెలియవు! నలుగురి ఎదుటా ప్రదర్శించి, ప్రశంసలు పొందిన మీ ప్రతిభపట్ల యింకా మీకు అనుమానమేనా? నే నసలు యీ పరిషత్‌కి వచ్చిన ముఖ్య ఉద్దేశం, యిద్దరు నటులను బుక్ చెయ్యాలని! కాని; నా దృష్టికి మీ రొక్కరే కనిపించారు' తతిమావారిలో యిక అర్హులయినవారెవరూ నాకు కనపడలేదు! మన ముఖాలలోని అందచందాలు చూచుకోటానికే కదండీ మనకి అద్దాల ఉపయోగం!—అలాగే మీ ప్రతిభను ఒక్కసారి మీ కళ్లారా చూచుకోవచ్చు! యిక ఆలోచించకండి! మీరు ఊఁ!—అనాలి మరి!" అని రవిచేతులు రెండూ పుచ్చుకుని ఊపాడు!

రవి ఆనందంగా—

"ఊఁ!...సరే మీ యిష్టం'" అన్నాడు!

"థ్యాంక్స్!" అని, దయానంద్, ఆనాడే రవిచేత సినిమాలో నటించటానికి, ఎగ్రిమెంటు రాయించుకుని వెళ్ళిపోయాడు!

ఆ విషయం మర్నాడే, హనుమంతరావుకీ, సుందరామయ్యకీ తెలియజేస్తూ ఉత్తరాలు రాశాడు రవి!

* * *

శర్మ రఘుని పట్టుదలతో పైకి తీసుకువచ్చాడు! తన కొడుకుపట్ల కూడా అంత శ్రద్ధవహించలేదకను! రవిలో వున్న కళాప్రతిభే అందుకు కారణం! వృద్ధిలోకి వచ్చేవాడు కనకనే శ్రద్ధవహించాడు శర్మ! అతని ప్రయత్నం సత్ఫలితాన్ని పొందింది! రఘులోని సహజశక్తి స్వల్పకాలంలోనే పైకివచ్చి, ప్రకాశించింది! చిన్నవయసులోనే గొప్ప కళాకారుడయాడు! మంచిపేరు సంపాదించాడు! ఎక్కడేనా సరే! రఘు గానకచేరీ చేస్తున్నాడంటే, నదీ ప్రవాహంలా ఎక్కడెక్కడే జనమో, దూరాన్నించికూడా వస్తారు! అతని గానంలో అంతటి మాధుర్యం వుంది! పాటతో ప్రజలను పరవశుల్ని చేసే శక్తి అతని కంఠంలో ప్రకాశిస్తోంది!

పెద్దలకచేరీలు ఎక్కడయినా సరే, రఘుని తీసుకుపోతాడక్కడికి శర్మ! వారినుంచి రఘు యింకా నూతన విషయాల్ని నేర్చుకుంటాడని! శర్మ చేసినపని రఘుమీద

బాగా పనిచేసింది! పెద్దలకచేరీలు శ్రద్ధగా విని, గానంలో నవ్యరీతుల్ని ఆకళింపుచేసుకున్నాడు!

యిలా సేకరించిన విషేషవిజ్ఞానంతో, పరిచయమైన పెద్దల ఆశీర్వచన బలంతో, రఘు పెద్దతరహా గాయకులలో ఒక స్థానాన్ని సంపాదించగలిగాడు! నలుమూలల నుండి ఆహ్వానాలు అందుకుంటున్నాడు! తన గానమాధుర్యాన్ని నలువైపులా వెదజల్లుతున్నాడు!

ఆ సంవత్సరం హైదరాబాదులో జరుగుతున్న, అఖిల భారత గాయక మహాసభలనుంచి రఘుకి ఆహ్వానం వచ్చింది! ఆ మహాసభలలో రఘు గానకచేరీ ఏర్పాటు చేయబడింది! దేశం నలుదిక్కులనుండే వచ్చే గాయకశిఖామణులందరి ఆశీర్వచనాలూ అందుకునే సదవకాశం కల్పించాయి ఆ మహాసభలు!

ఆ మహాసభలకు గవర్నర్ అధ్యక్షత వహించారు!!

ఆరోజు రఘు కచేరీ పూర్తయింది!-

తన మృదుమధుర గాన ప్రవాహంతో; అందరినీ మంత్రముగ్ధుల్ని చేసేశాడు రఘు! ఆతని వయసుకుమించిన ప్రతిభకి, గవర్నర్ కూడా అచ్చెరువొందారు! కచేరీ పూర్తవగానే రఘుని గాఢంగా, ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు! తానొక ప్రత్యేకబహుమతీ, ప్రశంశాపత్రం యిచ్చారు గవర్నర్!

మహాసభవారు ఆ కళాకారుణ్ణి, "గానసరస్వతి!" అను బిరుదిచ్చి, సత్కరించారు.

ఆ సభలలో, పెద్దలందరి సమక్షంలో, రఘుకి లభించిన ఉన్నతస్థానం, సన్మానం చూచి, శర్మ హృదయం ఆనందలితో పరవళ్లు తొక్కింది! పసితనం పోని రఘు పాలబుగ్గలను ప్రేమతో స్పృశించాడు!

సభలు ముగిశాయి!-

రఘుతో ఆ మధ్యాహ్నం రైలెక్కదామనుకుంటున్న శర్మని, కలుసుకోడానికి వచ్చాడో వ్యక్తి!

"రఘు మీ అబ్బాయాండీ?" అనడిగాడు!

"కాదండి! నా శిష్యుడు!" అని చెప్పాడు శర్మ!

"యిటువంటి కళాకారుణ్ణి శిష్యుడుగా పొందగలిగారంటే, మీరు చాలా అదృష్టవంతులండి!"

"అంతా దైవకటాక్షం!"-యింతకీ మీ పేరేమిటో చెప్పారు కాదు?"

"నా పేరు దయానంద్!" దయానంద్ ప్రొడక్షన్స్ అనే సినిమా సంస్థ మాదే!"

"అలాగా! పేరుమోసిన ప్రఖ్యాత సినీ నిర్మాత దయానంద్ గారు మీరేనా? మీ సినిమాలన్నీ చూడలేకపోయినా; మీ గురించీ, మీ ప్రతిభనుగూర్చి చాలా విన్నాను! మీతో కలయిక చాలా సంతోషంగా వుందండీ!"

"వచ్చి వుట్టిచేతులతో పోనక్కరలేకుండా జరిగినందుకు నాకూ చాలా సంతోషంగానే వుందండి!"

"మీరేదేనా ముఖ్యమైన పనిమీద వచ్చారా హైదరాబాదు?"

"అవునండి! చాలా ముఖ్యమైనకార్యంమీద వచ్చాను వచ్చినందుకు వృధాపోలేదు! నేనొక సినిమాతీసే ప్రయత్నంలో వున్నా ప్రస్తుతం! మూలమూలల మరుగుపడి వున్న ప్రతిభావంతులైన కళాకారులందరనూ వెతికి, వారి ప్రతిభ ప్రజలకు, నా సినిమాద్వారా పరిచయం చేద్దామని నా ఆశయం."

"మీ ఆశయం కొనియాడతగిందే!"

"అందుకే! నా యీ నాలుగవపిక్చరులో అందరినీ కొత్తవారినీ బుక్ చేస్తున్నాను! మరొక నూతన కళాకారుని అన్వేషిస్తూ యీ ఊరువచ్చాను! నా ప్రయత్నం ఫలించింది! నిన్నటి మహాసభలలో తన విశేష ప్రతిభను చూపిన మీ రఘు నా హృదయంలో హత్తుకుపోయాడు! యిటువంటి యువకళాకారుణ్ని లోకానికి పరిచయం చేసే భాగ్యం నాకు మీరు కల్పిస్తారని ఆశిస్తున్నాను!"

శర్మ ఆయన ఆంతర్యాన్ని గ్రహించాడు! నేటికాల మానవపరిస్థితుల్లో, వ్యక్తియొక్క ప్రతిభావిశేషాలు నలుదిశలా చాటబడాలంటే సినిమాలే ముఖ్య సాధనాలు! ప్రతిభకల వ్యక్తి, పేరుప్రఖ్యాతులు గడించడానికి సినిమాలే!...సినిమాలవల్లే వ్యక్తి ప్రజలలో కీర్తి సంపాదించగలుగుతాడు!...అతని ప్రతిభకి తగిన ప్రతిఫలమూ ముడుతుంది!—ఆలోచించాడు శర్మ!

"రఘు మా సినిమాలో పాడటానికి మీరు అంగీకరించాలి!" అన్నాడు దయానంద్ తిరిగి!

శర్మ రఘు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, సినిమాలో పాడటానికి సమ్మతించాడు!

దయానంన్ రఘుచేత ఎగ్రిమెంటు రాయించుకుని, "నేను టెలిగ్రాం యిచ్చిన వెంటనే రఘుని తీసుకుని

మద్రాసు వచ్చెయ్యండి!.. వస్తా! శెలవు! మీ సహృదయానికి నా కృతజ్ఞత!'' ప్రకాశరావు శర్మదగ్గిర శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు!

శర్మ రఘుతో యింటికి వచ్చేశాడు!

హనుమంతరావుకి ఈ విషయం రాస్తూ, మద్రాసు నుంచి కబురు రాగానే రఘుతో మద్రాసు వెళ్ళాలనీ; కనక హనుమంతరావునీ, రత్తమ్మనీ ఓసారివచ్చి నాలుగు రోజులుండి వెళ్ళమనీ ఉత్తరం వ్రాశాడు శర్మ! వారితో బాటే, రవికికూడా ఓ ఉత్తరం రాశాడు! రవినికూడా ఓసారి రమ్మని వ్రాసాడు!

రత్తమ్మా, హనుమంతరావూ యీవైపునుంచీ, రవి బెజవాడనుంచీ ఓరోజునే శర్మయింటికి వచ్చారు!

"నా కడుపున పుట్టారు కనకనే. యిలా అదృష్టం కోరి వస్తోందిరా మిమ్మల్ని!'' అంది రత్తమ్మ, యిద్దరి కొడుకులనూ ప్రేమతో చేరదీసి! రవి అన్నాడు-

"అమ్మా! ఆనాడు నువ్వు మమ్మల్ని యిద్దర్నీ యింటిలోంచి పంపనని మంకుపట్టుపడితే మే మిద్దరం యిలా పైకివచ్చే అవకాశమే లేకపోను! నువ్వు అంగీకరించావు కనకనే మేము యింతటివారమయాము!'' అని!

రవి విస్మరించిన ఓ ముఖ్యవిషయాన్ని రత్తమ్మ జ్ఞాపకం చేసింది!

"రవీ! అక్కడే నువ్వు పొరపడుతున్నావు! మీ అభివృద్ధికి ముఖ్యకారకులు ఎవరో వారిని మర్చిపోకూడదు మీరు! నిన్ను మామయ్యా; రఘుని శర్మగారూ ఆదరించి చేరదీయకపోతే మీరు అలాగే వుందురు! వాళ్ళిద్దరికీ మీరిద్దరూ ఏంచేసినా తీరదు ఋణం! ఆమాట మాత్రం మీరు జన్మలో మరువకూడదు!''

రత్తమ్మ వివేకానికి హనుమంతరావు చాలా ఆనందించాడు!

"రవీ' కృతజ్ఞతగా నువ్వు మామయ్యకు చేయవలసిందేమిటో తెలుసా?...లక్ష్మిని పెళ్ళిచేసుకోవాలి! ఏమంటావ్?'' అడిగింది రత్తమ్మ!

నాలుగురోజులు పోయాక ఎక్కడివారక్కడికి చేరుకున్నారు! వెళ్ళేటప్పుడు మధ్యలో ఆగి; సుందరరామయ్యనీ, రామలక్ష్మినీ చూచి మరీ వెళ్ళాడు రవి!

* * *

ఓ నెలరోజులు గడిచాక; రఘుని తీసుకుని వెంటనే బయల్దేరిరమ్మని టెలిగ్రాం వచ్చింది మద్రాసునుంచి! దానితోపాటు ఓ మూడువందలరూపాయలు మనియార్డరు కూడా వచ్చింది!-శర్మ రఘుని తీసుకుని మద్రాసుప్రయాణమై రైలెక్కాడు!

రైలు బెజవాడ స్టేషన్లో ఆగింది!—చేత్తో పెట్టా, బెడ్డింగ్తో ఆ పెట్టెనే ఎక్కాడు రవి!

"అరే!...నువ్వు యీ బండికే వస్తున్నావా?'' అన్నాడు రవిని చూచి రఘు ఆశ్చర్యంగా!

"నాకు యివేళే టెలిగ్రాం, మూడు వందలు మనియార్డరూ వచ్చింది! వెంటనే రమ్మని రాశాడు దయానంద్! మీకూ ఇవాళే టెలిగ్రాం వచ్చిందా? మీరు వస్తున్నట్లు నాకూ తెలవదసలు! బాగానే కలుసుకున్నాం!'' అన్నాడు రవి నవ్వి!

రైలు కదిలింది—

ఇద్దరు మహామహులైన యువకళాకారులను మద్రాసు చేరవేసే భాగ్యం తనకి కలిగినందుకు గర్వమో! ఆనందమో!—ఒక్కసారి యికిలించి, హుషారుగా పరుగు తీసింది రైలు!

రవి నటించిన మొదటి సినిమాలో', రఘు మొదటిసారిగా తన కంఠం రవికే ఎరువిచ్చాడు!

అందరూనూ తన కళాకారులు పరిచయం చేయబడ్డ 'జయ ప్రొడక్షన్స్'వారి నాలుగవ చిత్రం, శతదినోత్సవాలూ, రజతోత్సవాలూకూడా జరుపుకుంది! ప్రకాశరావు అనుకోనంత డబ్బు సపాదించాడు!

* * *

ఇప్పుడు రఘు ప్రఖ్యాత గాయకుడేకాదు; సంగీత దర్శకుడుకూడా!

రవి 'నటకావతంస' అనే బిరుదు సంపాదించాడు! పేరు మోసిన పెద్ద నటుల మధ్య ప్రత్యేక స్థానాన్ని సంపాదించాడు.

హనుమంతరావూ, రత్తమ్మా మద్రాసు వచ్చి కొడుకుల దగ్గిరే వుంటున్నారు!

రవి, మామయ్య సుందరరామయ్య కూతురు లక్ష్మిని పెళ్ళిచేసుకున్నాడు!

యిప్పుడిక హనుమంతరావుకి సంపాదించాలనే బాధ లేదు! అతని మనసు హాయిగా, నిశ్చింతగావుంది! కొడుకులిద్దరి గురించీ, వారి అభివృద్ధిని గురించీ కలతచెందిన అతని హృదయంలో ప్రశాంతత ఏర్పడింది!

(తరువాయి 20వ పేజీలో)

అతడు ఆమెవైపు చూస్తున్నా, యేదో విషయం గురించి ఆలోచిస్తూ యిలా అన్నాడు-

'అబ్బే యేమీ లేదు. ఎప్పుడూ ప్రయాణం చేస్తుండే మాకు యిలాంటివి అలవాటై పోయాయి. ఆ అబ్బాయి ఉత్తరం తీసుకెళ్ళమని అడిగాడు. సరేనన్నాను. ఇందులో కష్టమైన పనియేమున్నది? నిన్ను అడిగానని చెప్పమన్నాడు.'

బండి కదిలింది. యువతి ఉత్తరాన్ని గట్టిగా చేతిలో పట్టుకొని నిలబడ్డది. రెండవ చెయ్యి గాలిలో ఊపుతున్నది. ఆమె రూపం అంతకంతకూ చిన్నదై పోతున్నది. ఉత్తరం అందించిన మనిషికూడా చెయ్యి ఊపుతున్నాడు.

ప్రక్క కిటికీ వద్ద యిద్దరు మాట్లాడుకొంటున్నారు-

'పంతులమ్మకు ఉత్తరం వచ్చింది. ప్రతి రోజు ఉత్తరాలు యిలా వస్తూనే ఉంటాయి. ఒకరికొకరు దూరమై పోవటంవల్ల బండిలో రోజూ ఉత్తరాలు పంపించుకొంటుంటారు.'

'ఇంతకూ మూడు గంటల ప్రయాణం. అయినా ప్రేమంటే అలాంటిది.

యువతి యిక కనబడటంలేదు. కాని ఉత్తరం అందించిన నడి వయస్సు మనిషి యేదో ఆలోచిస్తూ అలానే కూర్చొని ఉన్నాడు.

నేనుకూడా వెన్నక్కి చూస్తున్నాను. యువతి కనబడటంలేదు. బండి శరవేగంతో వెళ్ళిపోతున్నది.

నాకుకూడా అలాంటి ఉత్తరాలు రావాలని, 'నువ్వేనా లాజరువు' అని యెవరైనా అడగాలని అనిపించింది.

బహుశ ఉత్తరం తెచ్చిన మనిశికూడా అలానే ఆలోచిస్తున్నాడేమో?

ఎదురు గాలిని చీల్చుకొంటూ మా బండి ముందుకు ఉరుకుతున్నది.

---


# కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం. 1938.

| | |
|---|---|
| విడి ప్రతి | — 25 న. పై. |
| సంవత్సర చందా | — రూ. 4-00 |

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్‌లలోనూ దొరుకును.


---

(9వ పేజీ తరువాయి)

రత్తమ్మ, కొడుకు లిద్దరూ వేలకువేలు సంపాదిస్తున్నా, 'పొదుపు ఉద్యమం' మాత్రం పాటించడం మానలేదు దూబరా ఖర్చులన్నీ అదుపెలో పెట్టేసింది!

శర్మకూడా మద్రాసులోనే వుంటున్నాడు!

నేటి రోజున రఘు పాడని సినిమా లేదు!

రవి నటించని సినిమాకి పేరురాదు!

ఆ సంవత్సరం అన్న దమ్ము లిద్దరూ 'రాష్ట్రపతి' పతకాలుకూడా సంపాదించారు!

వారిద్దరినీ చూచుకుంటూ ఈ లోకాన్నే మరచి పోతూ, కాలాన్ని గడుపుతున్నారు, హనుమంతరావు, రత్తమ్మాలు!

తన ఫలించిన ఆశలన్నిటినీ మాలగా కూర్చి, ఆదండ నటరాజు మెడలో వేశాడు శర్మ! తన ప్రయత్నం ఫలించినందుకు, ఆయనకు మ్రొక్కాడు.

— మంగళమ్ —